# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 03 ఫిబ్రవరి 2025


## ప్రజాదర్బార్ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదు

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**చిన్నమండెం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**

అధికారులు ప్రజా దర్బార్ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం, బోరెడ్డిగారి పల్లెలోని తమ నివాసం నందు మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలపై ప్రజాదర్బార్ కార్యక్రమానికి వస్తుంటారని అధికారులు ప్రజాదర్బార్ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని భూ సమస్యలను రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధచూతి పరిష్కరించాలన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ అదేశాలు జారీచేశారు.

## ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**యర్రగుంట్ల ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**



ఆదివారం ఎర్రగుంట్ల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు ఎస్పీ అశోక్ కుమార్ వచ్చి తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నందు పలు రికార్డులను పరిశీలించి పలు కేసులు గురించి ఆరా తీసి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ పట్టణంలో దొంగతనాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్ సిబ్బందితో మీకేమైనా సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్ లో ట్రైనీ డీఎస్పీగా శిక్షణ పొందుతున్న భవాని, మరియు ఎర్రగుంట సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్ బాబు లు పాల్గొన్నారు.

# సీఎంకు వినతి పత్రాలతో సరి..!!

- అన్నమయ్య జిల్లాలో దుస్థితి మారెడెన్నడు?
- ప్రధాన సమస్యలపై కానరాని హామీలు
- ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వృక్ష, ఖనిజ సంపద ఉన్నా లాభమేమిటి?

**అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త**

ఎక్కడైతే అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చిత్తశుద్ధి కరవవుతాదో అక్కడ ప్రజలు దుర్భర జీవితాన్ని అనుభవించక తప్పదు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా అన్నమయ్య జిల్లాలో పరిస్థితులు తయారయ్యాయి. వరాలిచ్చి ఆదుకునే సాక్షాత్తూ సీఎం అన్నమయ్య జిల్లాకు వస్తే జిల్లాలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సంబంధించి హామీలు అందుకోలేకపోయినప్పటికి సీఎంతో ఫోటోలకు ఫోజులివ్వడం, వినతిపత్రాలు సమర్పించడం వరకు ఇక్కడి నేతలు విజయం సాధించారని చెప్పవచ్చు. హార్టికల్చర్ హబ్‌గా మారుస్తానన్న హామీ మినహాయిస్తే ఇక్కడ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వృక్ష, ఖనిజ సంపద ఆధారంగా పారిశ్రామికాభివృద్ధిపై హామీలు అందుకోలేకపోవడం జిల్లా ప్రజల దురదృష్టం. అన్నమయ్య జిల్లాలో నిరుద్యోగ యువతతో పాటు మహిళలు, రైతులు కట్టు బానిసలుగా 40 ఏళ్లుగా గల్ఫ్ దేశాలకు వలసలు వెళుతున్నారు. ఇక పార్లమెంటు, డివిజన్ కేంద్రమైన రాజంపేట విషయానికి వస్తే కనీసం ఎన్నికల సమయంలో ప్రధాన సమస్యలపై ఇచ్చిన హామీలపై కూడా ఊసు కనిపించక అనాథగా మిగిలిపోయింది. దేశంలోని నలుమూలలకు నిత్యం జిల్లానుండి వందల లారీల్లో మామిడి, బత్తాయి, నిమ్మ, ఆరటి, బొప్పాయి తదితర వివిధ రకాల కమ్మని పండ్లతో పాటు టమోటా తదితర కూరగాయలు రవాణా అవుతుంటాయి. ఈ తోటల ఆధారంగా పలు రకాల పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలుంది. అయినా పట్టించుకునే నాథుదే లేరు. ఔషధ మొక్కలు కూడా జిల్లాలోని రాజంపేట అటవీ డివిజన్‌లో విస్తారంగా ఉన్నాయి. నిపుణుల అంచనా మేరకు 60కి పైగా ఔషధ మొక్కలు ఈ అటవీ డివిజన్‌లో పుష్కలంగా ఉన్నట్టు తెలిసింది. వీటి ఆధారంగా మందుల పరిశ్రమలు కూడా ఏర్పాటు చేయవచ్చని తెలుస్తున్నా ఎవ్వరికీ పట్టదు. ఇక్కడి ప్రజాప్రతినిధుల్లో చిత్తశుద్ధి లోపించడంతో కట్టు బానిసలుగా కడుపు చేత పట్టుకొని గల్ఫ్ దేశాలకు నిరుద్యోగ యువతతో పాటు, మహిళలు, రైతులు 4 దశాబ్దాలు పైబడి ఉపాధి మృగ్యమై అవకాశాలు వెతుక్కుంటూ వలసలు వెళ్ళక తప్పడం లేదు. అన్నమయ్య జిల్లాలో నెలకొన్న ఈ దుస్థితి మారెడెప్పుడని ఎదురుచూస్తున్న ఇక్కడి ప్రజానీకం ఆశలు దశాబ్దాలుగా ఆడియాశలవుతూనే వస్తున్నాయి. ఇక్కడున్న వనరుల ఆధారంగా పరిశ్రమలను నెలకొల్పి ఉంటే ఇక్కడి ప్రజానీకం ఎదుర్కొంటున్న ఉపాధి సమస్యకు పరిష్కారం లభించి ఉండేది. ఈ దిశగా సీఎం జిల్లాకు వచ్చినప్పుడు పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి ఇక్కడి నేతలు కృషి లోపించినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం పర్యటనలో నీటి వనరులకు సంబంధించి ప్రస్తావన కానరాలేదు. కొట్టుకుపోయిన అన్నమయ్య జలాశయం పరిస్థితి ఏమిటో ఆ దేవునికే తెలియాలి. జిల్లా కేంద్రానికి సంబంధించి రాజంపేటకిచ్చిన హామీ మొదలు తరలిపోయిన మెడికల్ కళాశాల వరకు సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పడిపోక తప్పదా అనిపించేలా సీఎం పర్యటనను సరిగ్గా ఇక్కడి నేతలు ఉపయోగించుకోలేకపోయారన్నది వాస్తవం. ఈ జిల్లా పరిధిలో గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన నేతలున్నా ఫలితం శూన్యం. సీఎంలు, కేంద్ర మంత్రులు ఇక్కడివారున్నప్పుడు భారీ పరిశ్రమలు తీసుకొచ్చి ఇక్కడి నిరుద్యోగ సమస్యకు చక్కటి పరిష్కారం చూపుతారని భావించిన ఇక్కడి ప్రజల నమ్మకం వమ్ము అయ్యింది. కనీసం భారీ పరిశ్రమలు తేలేకపోయినా, మంగంపేట వద్ద ఉన్న ప్రపంచ ప్రఖ్యాతి




గాంచిన బరైటీస్ ఖనిజంతో పాటు ముగ్గురాయి, రాజంపేట అటవీ డివిజన్ పరిధిలో విస్తరించి ఉన్న ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎర్రచందనం వృక్ష సంపద ఆధారంగా పరిశ్రమలు తెచ్చేందుకు వీలున్నా ఆ దిశలో కృషి జరగకపోవడం ఇక్కడి ప్రజల దురదృష్టం. పండ్ల తోటలు, ఖనిజ, వృక్ష సంపద ఆధారంగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధిప రిచేందుకు స్థానికంగా ఎన్నో అవకాశాలున్నాయి. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయం కూడా వర్షాధారంపైనే ఆధారపడి ఉంది. కనీసం వర్షాధారంపై ఆధారపడకుండా శాశ్విత సాగునీటి వనరులను రైతుల దరికి చేర్చి ఉంటే కనీసం రైతాంగంతో పాటు వ్యవసాయం గాడిలో పడి కొంతలో కొంతైనా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించి ఉండేది. అయితే ఇక్కడ వ్యవసాయం వర్షాధారంపై ఆధారపడడం వల్ల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కనీసం మొన్నటి వరకూ ఆదుకుంటూ వచ్చిన అన్నమ య్య, ఫించా ప్రాజెక్టులు కూడా కొట్టుకుపోయి ఉన్న కొంత ఆధారం కూడా రైతులకు లేకుండా పోయింది. కనీసం గాలేరు-నగరి ప్రాజెక్టు పూర్తయ్యితే చాలావరకు రైతులకు వర్షాధారంపై ఆధారపడని పరిస్థితులు నెలుకొంటాయి. అయితే గాలేరు-నగరి ప్రాజెక్టు పూర్తి చేసే విషయంలో హామీలకే పరిమితమవుతూ వస్తుంది. ఇక్కడి చెయ్యేరు, పెన్నా నదుల్లో కూడా 100 టిఎంసిల వరకు నీటి వనరులున్నాయని నిపుణులు తేల్చినందున ఎత్తిపోతల పథకాలపై దృష్టి పెడితే వర్షాధారంపై ఆధారపడకుండా చాలావరకు రైతుల దరికి సాగునీటిని చేర్చేందుకు వీలవుతుంది. అసలే గాలిలో దీపంలా మారిన వ్యవసాయంతో అల్లాడిపోతున్న దశలో పారిశ్రామికంగా అభివృద్ధి పరిస్తే స్థానిక యు వతకు ఉపాధిపరంగా అవకాశాలు చూపినట్లవుతుంది. మిగిలిన దీర్ఘకాలిక సమస్యలను ప్రక్కనుం చినా రైతులు, యువతకు సంబంధించి సాగునీటి వనరులు, పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి సీఎం వద్ద సరైన దిశలో ఇక్కడి నేతలు ప్రజంటేషన్ ఇవ్వలేకపోవడం జిల్లా ప్రజల దురదృష్టం. ఇప్పటికైనా ఇక్కడి ప్రజాప్రతినిధులు ఇక్కడి వనరుల ఆధారంగానైనా పారిశ్రామికంగా అభివృద్ధిపరిచే అంశంపై దృష్టి పెట్టాల్సి ఉంది.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు

**సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు గుర్తిస్తున్న రాష్ట ముఖ్యమంత్రి**

**ప్రభుత్వం చేపట్టే అభివృద్ధిని చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు**

**రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**చిన్నమండెం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో ఎవరు చేయని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలతో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఆదివారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చిన్నమండెం మండలం వండాడి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మాట్లాడుతూ గతంలో ఎవరు చేయని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పట్టిస్తున్నారన్నారు. రాబోయే రోజులలో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధి లైట్లు తదితర మౌలిక వసతులు కల్పించి గ్రామాలు ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలలకే ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాబోయే రోజులలో రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి చెరువులో పూడికతీత పనులు చేపట్టి చెరువు మరమత్తు పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇలాంటి మంచి ప్రభుత్వం పది కాలాలపాటు ఉండేందుకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

### అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై

# పునరాలోచనలో ప్రభుత్వం?

**తెరపైకి అన్నమయ్య ఎత్తిపోతల పథకం**

**చెరువులకు నీరు నింపేలా డిజైన్**

**ఉన్నత స్థాయి ఆదేశాలతోనేనా ఈ డిజైన్?**

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త:**

అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడిందా? 787కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం ఇప్పట్లో సాధ్యం కాదు కదా? ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన ఎన్నేళ్లు పడుతుందో తెలియదు. ఎప్పుడో పూర్తయ్యే ప్రాజెక్టు కోసం అప్పటివరకు ప్రత్యామ్నాయంగా మరొక పథకం ద్వారా నీరు అందిస్తే ఎలా ఉంటుంది అన్న ఆలోచనకు ప్రభుత్వం వచ్చిందా? ఇది నిజమేనని తెలుస్తోంది. ఎందుకంటే తాజాగా అన్నమయ్య ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేయడంలో నిమగ్నమయ్యారు. దీన్ని బట్టి చూస్తే తాత్కాలికంగా ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులు చేపట్టే విషయంలో పక్కకు తప్పుకున్నట్లే అని తెలుస్తోంది. అన్నమయ్య ప్రాజెక్ట నిర్మాణంపై కోటి ఆశలతో ఎదురుచూస్తోన్న రైతుల కోసం 'వార్త' అందిస్తున్న ప్రత్యేక కథనమిది.

అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం చేయాలంటే 787కోట్ల రూపాయలు నిధులు అవసరం. ఇప్పుడు ఉండే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కూటమి ప్రభుత్వం ఈ నిధులను ఒక నియోజకవర్గం కూడ కాదు 3మండలాల కోసం కేటాయించడంపై తీవ్రంగా ఆలోచించి తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. రెండు నెలల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా జలవనరుల శాఖలో చేపట్టిన పనులు 25శాతం లోపు జరగకున్నా వాటి వివరాలను కోరింది. కడప జిల్లా నుంచి ప్రధానంగా అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన విశయం కడప జిల్లా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆ నివేదిక ప్రకారం ఇప్పటికే టెండర్లు ముగిసి పనులు ప్రారంభించిన తర్వాత ఎన్నికలు రావడం జగన్ సర్కార్ నిధులు విడుదలకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో పనులు చేజిక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థ చేతులెత్తేసింది. దీంతో ఇన్వెస్టిగేషన్ పనులు మాత్రమే ప్రారంభమై నిలిచిపోయాయి. 5శాతం పనులు కూడ జరగలేదు. దీనికి తోడు బడ్జెట్లో కూడ నిధులు కేటాయించలేదు. దీనికి తోడు గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులు అంచనాలపై కూటమి ప్రభుత్వానికి పలు సందేహాలు ఉన్నాయి. వీటన్నటికి కూడ నిధుల సమస్య అందుకే ప్రాజెక్టు పునర్నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచన చేసినట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా గత నెలలో జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుదారులు లోతట్టు ప్రాంత ప్రజానీకంకు లబ్ధి చేకూరేలా ఎలా చేస్తే బాగుంటుంది ప్రాజెక్టును ఏమి చేస్తే అందరికి ప్రయోజనకరంగా ఉంటుంది ఇప్పుడిప్పుడే ప్రాజెక్టు పూర్తి కాదని పనులు చేపట్టిన కొన్నేళ్లు పడుతుందని అందుకే పలు ఆలోచనలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నట్లు ఆయనను కలిసిన టీడీపీ, కాపునాడు నేతలతో అన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని రాజంపేట నియోజకవర్గ రైతాంగం ఆశలు నెరవేరుస్తామని సీఎం చంద్రబాబు చెప్పిన విశయాన్ని డిప్యూటి సీఎం పవన్‌కళ్యాన్ హామీలను ప్రస్తావించిన మంత్రి మాత్రం ప్రాజెక్టు పునర్నిర్మాణం చేపడతామని మాత్రం చెప్పలేదు. అంటే ఇప్పటికే ఉన్నత స్థాయిలో అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణంపై పునరాలోచన పడిన వ్యవహారం స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా గత నెల 15నుంచి అన్నమయ్య ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఎత్తిపోతల పథకాన్ని తాత్కాలికంగా చేపట్టే విశయమై అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఒక ఆకృతి సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రాథమికంగా ఆ ప్రతిపాదనలను జల వనరులశాఖ ఎస్సీ కార్యాలయానికి పంపినట్లు సమాచారం. సమగ్ర సమాచారం లేకపోవడంతో ఎస్సీ కార్యాలయం వెనక్కి పంపినట్లు కూడ విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. 197 హెచ్‌పీ సామర్థ్యంతో మోటార్ ఏర్పాటుచేసి చెయ్యేరు నది నుంచి ఎత్తిపోయాలనేది ప్రాథమిక ఆలోచన. నదిలో ప్రవాహం వచ్చినప్పుడు ఈ నీటిని హెడ్ రెగ్యులేటర్ ద్వారా ప్రాజెక్టు కింద ఉన్న రాజంపేట మండలంలోని హస్తవరం చెరువు, కృష్ణమ్మ చెరువు, ఊటుకూరు చెరువు, మన్నూరు చెరువు, పుల్లంపేట మండలంలోని మరొక చెరువుకు నీరు నింపాలన్నది యోచన, అందుకు 50నుంచి 100 క్యూసెక్కుల నీరు సామర్థ్యంతో చెరువులకు నీరు నింపేలా చెయ్యేరు నదిలో ఇంటెక్ వెల్, జాక్‌వెల్ నిర్మిస్తారు. అయితే ఎత్తిపోతల పథకం డిజైన్ చేసేందుకు సాంకేతిక పరమైన అంశాలు ఇతర డిజైన్ల కోసం ఐడీసీలో నిపుణుడైన కర్నూలు జిల్లాకు చెందిన ఓ అధికారిణి కూడ సంప్రదించినట్లు సమాచారం. ఈ విధంగా ప్రాజెక్టు అధికారులు ఎత్తిపోతల పథకం డిజైన్ చేస్తున్న పరిస్థితి చూస్తే అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం ఇప్పట్లో జరగదనేది సుస్పష్టంగా తెలుస్తోంది. దీనిపై రాజంపేట నియోజకవర్గంలోని కూటమి నేతలు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే. ఎందుకంటే ఈ నెలలోనే బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. బడ్జెట్లో అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి నిధులు కేటాయించకపోతే ప్రాజెక్టు ఆటకెక్కడం ఖాయమనేది సుస్పష్టం. ఈ నేపథ్యంలో ఎత్తిపోతల పథకం అన్నమయ్య ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయం అవుతుందా సాంకేతికంగా ఈ ప్రతిపాదనలు ఆచరణ సాధ్యమా? అంతకంటే ముందు చెయ్యేరు నది గర్భంలో సొరంగాలు ఉన్న నేపథ్యంలో ఒక చోట నీరు నింపడం ఆచరణా సాధ్యమేనా? వీటన్నింటిని పరిశీలించకుండానే ఎత్తిపోతల పథకంపై అన్నమయ్య ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారంటే జలవనరుల శాఖ ఉన్నత స్థాయి అధికారుల నుంచి సంకేతాలు లేకుండానే ఈ పనులు చేస్తారా..కూటమి నేతలు సీఎం, డిప్యూటి సీఎంల దృష్టికి తీసుకుపోయి అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై స్పష్టత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లేదంటే సీఎం, డిప్యూటి సీఎంలు ఇద్దరూ అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కినట్లే.

### సామాజిక ఆరోగ్యకేంద్రం నూతన భవనం ప్రారంభోత్సవం జరిగి పది నెలలు

# అందుబాటులోకి ఎప్పుడో!



**తంబళ్లపల్లె ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ః**

నియోజకవర్గ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సేవల విస్తరణకు గత రెండేళ్ల క్రితం నూతన భవన సముదాయం నిర్మించారు. పనులు అరకొరా ముగించి సదరు కాంట్రాక్టర్ హడావిడిగా ప్రారంభోత్సవం చేయించారు. అయితే భవన సముదాయం నిర్మించి పది నెలలు గడుస్తున్నా ఆసుపత్రికి అప్పజెప్పలేదు. ఆసుపత్రిలో మహిళలకు, చిన్నారుల తోపాటు ఆధునిక వైద్య పరికరాలతో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం రూ 4.65 కోట్లతో అధునాతన భవనాలు, వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలపై నిర్మాణం జరిగింది. సదరు కాంట్రాక్టర్ పనులు పూర్తి స్థాయిలో కాకపోవడంతో ఆసుపత్రి వర్గాలు భవనాన్ని స్వాధీనం చేసుకోవడానికి ససేమిరా అంటున్నారు. ఈ ఆసుపత్రికి ఎమర్జెన్సీ కేసులు వస్తే మదనపల్లికు తరలించడం ఆనవాయితీగా మారింది. ఈ ఆస్పత్రి నూతన భవన సముదాయం అందుబాటులోకి వస్తే మారుమూల ప్రాంతాలలోని నిరుపేద రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందుతాయి. ఈ ప్రభుత్వాసుపత్రి పరిధిలో తంబళ్లపల్లె మండలంతో పాటు పెద్దమండెం, ములకలచెరువు మండలాల ప్రజలతోపాటు సత్యసాయి జిల్లా సరిహద్దులోని ఎన్ పి కుంట మండల ప్రజలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతాయిని ఆశపడ్డ ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. నాలుగు దశాబ్దాల క్రితం టిఎన్ కుటుంబీకుల స్థల దానంతో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రారంభించిన ఈ ముప్పై పడకల ఆసుపత్రిలో వైద్య సేవలు అంతంత మాత్రమే ఈ సమస్యపై స్పందించిన అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవనాలు నిర్మించిన ఎవరి నిర్లక్ష్యమో కానీ అందుబాటులోకి రాకపోవడం ఓ శాపంగా మిగిలింది. నేటి కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి సామాజిక ఆరోగ్య కేంద్ర నూతన భవన సముదాయం తో పాటు అధునాతన వైద్య సేవలు అందివ్వడానికి సహకరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### పనులు పూర్తయితేనే స్వాధీనం చేసుకుంటాం

**: మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి.**



నూతన భవన సముదాయంలో ఇంకా చేయవలసిన పనులు ఉన్నాయని వైద్య పరికరాలు రావాల్సి ఉందని పనులు పూర్తయిన తర్వాతే భవనం స్వాధీనం చేసుకుంటాం.




# సంక్షేమ పథకాలు అమలు చేయడం సీఎం చంద్రబాబునాయుడుకే సాధ్యం



**రాయచోటి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**

సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారికే సాధ్యమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు గతంలో ఎవరూ చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదన్నారు. గత 5 సంవత్సరాలలో వైసిపి ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయకుండా రాష్ట్రాన్ని దివాలా తీపించిన ముఖ్యమంత్రి ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమే అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తప్పక నెరవేర్చడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల గురించి వైసిపి వారు అసత్య ప్రచారం చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరన్నారు. అవ్వ తాతలకు ఇచ్చే పెన్షన్‌తో వారు సమాజంలో గౌరవంగా బ్రతుకుతూ నెలపొడుపున పెన్షన్ డబ్బుతో సంతోషంగా జీవిస్తున్నారన్నారు. ఫిబ్రవరి లేక మార్చిలో డీఎస్సీ నోటిఫికేషన్ వదిలి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. డీఎస్సీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా మంచి మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో ఎటువంటి అవకతవకలు జరగవున్నారు. ఉచిత గ్యాస్ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల గ్యాస్ సిలిండర్లు ఇప్పటికే ప్రజలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులకు ఏదైతే చెప్పామో రైతులకు ఇచ్చిన హామీలన్నీ తప్పక నెరవేర్చడం జరుగుతుందన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటి విప్లవం తీసుకువచ్చి భారతదేశంలో హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా రూపొందించి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. మన రాయలసీమ ప్రాంతంలో ఉండే ఎంతో మంది నిరుద్యోగులు కూడా సాఫ్ట్వేర్ ఉద్యోగాలలో స్థిరపడ్డారన్నారు. నిన్న జరిగిన సీఎం ప్రోగ్రాం లో ఒక వ్యక్తి సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ ఇంటి నుంచే లక్షల రూపాయలు సంపాదిస్తున్నానని తన కుటుంబాన్ని మొత్తం నేనే పోషిస్తున్నానని ముఖ్యమంత్రి వర్యులకు చెప్పడంతో సీఎం ఎంతో సంతోషం వ్యక్తం చేయడం జరిగిందన్నారు. ఎక్కడైనా మంచి జరుగుతుంటే సంతోషించాలి గాని అభివృద్ధిని అసత్య ప్రచారం చేస్తూ చేసిన పనిని చేయలేదనడం ఒక వైసీపీ నాయకులకే చెల్లుతుందన్నారు. ప్రభుత్వం గురించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసినట్లయితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని శిక్షించడం జరుగుతుందన్నారు.

## సాయి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆదిలక్ష్మమ్మ



**చిట్వేలి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:**

భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సాయి లోకేష్ ను, చిట్వేలి మండల భాజపా మహిళా మోర్చా అధ్యక్షురాలు రాయన ఆది లక్ష్మమ్మ ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. భాజపా పార్టీ బలోపేతానికి సాయి లోకేష్ చేస్తున్న కృషిని ఆమె కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని, రాష్ట్ర ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని ప్రతి ఒక్కరికి తెలియపరుస్తున్నామన్నారు.ప్రతి గ్రామంలోనూ బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తూ, ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తూ పార్టీ పటిష్టంగా తయారు కావడానికి కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ కు వివరణ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల భాజపా నాయకులు నరసింహులు, రంపా అంజన్న తదితరులు పాల్గొన్నారు.

## బైకు ఢీకొన్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

**తొండూరు ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :**

గత నెల 30న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తొండూరు మండలం గంగాదేవి పల్లె కు చెందిన గోకనపల్లి పెద్ద గంగిరెడ్డి(49) పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను పులివెందులలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించినప్పటికి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. వైద్యం పొందుతూ అయన తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు పలువురు గ్రామాల నాయకులు నివాళులర్పించారు.

## అసాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టిన

# కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు

### కడప జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు పెడబల్లి సుష్మ



**వేంపల్లి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :**

2025, 26 ఆర్థిక సంవత్సరానికి పార్లమెంట్ లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి వారికి భారీగా లాభం చేకూర్చేలా ఉందని కడప జిల్లా బిజేపీ ఉపాధ్యక్షురాలు పెడబల్లి సుష్మ అన్నారు. ఆదివారం వేంపల్లి లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మధ్యతరగతి ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడంతో పాటు సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని కల్పిస్తూ అసంఘటిత రంగం వారికి, నెల జీతం లేని వాళ్ళకి వారికి కూడా భరోసా కల్పిస్తూ ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టారన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే గ్రామీణ ప్రాంత వాసులకు నైపుణ్యం కల్పించి వారు ఉన్నచోటనే ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వలసలు నివారించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా కూడా దేశాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు మోడీ ప్రభుత్వం దేశాభివృద్ధికి ఉపయోగపడేలా ఈ వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు, విశాఖ స్టీల్ ప్లాంట్ కు, జీరో బడ్జెట్ వ్యవసాయానికి ఈ బడ్జెట్లో కేటాయింపు జరగడం శుభ పరిణామం అన్నారు. రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఈ కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది అనేదానికి ఈ కేటాయింపులే నిదర్శనం అన్నారు.

## మున్సిపల్ చైర్మన్ వాకమల్ల

# రాజ గోపాల్ రెడ్డికి మాతృవియోగం



**బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 02 ప్రభాతవార్త :**

బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజ గోపాల్ రెడ్డి తల్లి వాకమల్ల తులసమ్మ (86) ఆదివారం మృతి చెందారు, వివరాల్లోకి వెళితే బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి తల్లి అనేక సంవత్సరాలుగా వారి స్వగ్రామమైన పంగవాళ్ల పల్లెలో మరియు బద్వేల్ ప్రాంతంలో అనేకమంది బంధుమిత్రులతోనే కాకుండా ఇతరులతో కూడా ప్రేమ ఆప్యాయతగా అందర్నీ పలకరిస్తూ అందరిలో మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకున్న ఆమె మృతి విషయం తెలియగానే పలువురు దిగ్భంధికి గురయ్యారు, కీర్తిశేషులు వాకమళ్ళ రామ్మోహన్ రెడ్డి తులశమ్మ గార్లకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలరు, అయితే మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి అందరికీ సుపరిచితుడు కాబట్టి వారి తల్లి మృతి విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైసిపి యువ నాయకులు దేవసాని ఆదిత్య రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త కల్లూరు వెంకటరమణ రెడ్డి, అదనపు సమన్వయకర్త విశ్వనాథరెడ్డి, పారిశ్రామికవేత్తలు సానపు రెడ్డి రాధాకృష్ణారెడ్డి, రామ గోపాల్ రెడ్డి, స్టేట్ మాజీ డైరెక్టర్ సుందరరామ్ రెడ్డి, పుత్త శ్రీరాములు యద్దారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, రాచపూడి వెంకట సాయి కృష్ణ, సీనియర్ న్యాయవాది పి.వి.ఎన్ ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కనమర్లపుటి ప్రసాద్, కె.వి సుబ్బారావు, మాజీ డైరెక్టర్ పబ్బతి చంద్ర శేఖర్, కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, క్లాస్ వన్ కాంట్రాక్టర్ తమ్మిశెట్టి వెంకట సుబ్బయ్య పంగ చెన్న కృష్ణారెడ్డి, తోపాటు పలువురు వైసిపి నాయకులు ఆర్యవైశ్య ప్రముఖులు వ్యాపారస్తులు వారి బంధుమిత్రులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మృతి చెందిన తులసమ్మ భౌతికాయానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు, నేడు సోమవారం ఉదయం 10,గంటలకు వారి స్వగ్రామైన పంగావాండ్ల వారిపల్లె లో లోకముల తులసమ్మ అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారి కుటుంబ సభ్యులు వాకమల రాజగోపాల్ రెడ్డి, నారాయణరెడ్డి (బాబు) తెలిపారు.

## డిఎస్పి కార్యాలయాన్ని ఎస్పి ఆకస్మిక తనిఖీ



**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**

డీఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు త్వరగా విచారించి పరిష్కరించాలని రికార్డులు అప్ డేట్ చేసుకోవాలని ఆదేశించారు. సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించిన విధుల గురించి తెలుసుకున్నారు. పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించారు. ప్రొద్దుటూరు పట్టణంలో సి.సి కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతను తెలియచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని, వీలైనంత తక్కువ సమయంలో సి.సి కెమెరాలను అమర్చుకునేలా చూడాలని డిఎస్పికి సూచించారు. పట్టణంలో ప్రస్తుతం ఉన్న సి.సి కెమెరాలను పోలీస్ స్టేషన్ కు అనుసంధానించి పర్యవేక్షించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా పగలు,రాత్రి ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి క్షుణ్ణంగా విచారణ జరిపి నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు .ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. స్టేషన్ లో సిబ్బంది విధులను గురించి జిల్లా ఎస్.పి గారు అడిగి తెలుసుకున్నారు. మరింత సమర్ధవంతంగా విధులు నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. వృత్తి పరమైన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను(బ్లాక్ స్పాట్స్) గుర్తించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాలు జరగకుండా పగలు, రాత్రి ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని సూచించారు. లారీలు, టిప్పర్ల దొంగతనాలు జరగకుండా వాటి యజమానులకు జి.పి.ఎస్ అమర్చుకునేలా చూడాలన్నారు. పాత నేరస్థులు, సస్పెక్ట్ ల కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా గ్రామాలకు వెళ్లి ప్రజల తో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్,గ్యాంబ్లింగ్ తదితర నేరాలు జరగకుండా గట్టిగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్.పి గారి వెంట డి.ఎస్.పి బావా నా బుద్ధి, సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు ఎస్సైలు, అధికారులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం రవాణాలో ముగ్గురు వ్యక్తులు అరెస్ట్



**మైదుకూరు, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త:**

జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్ కుమార్ ఐఎఫ్ఎస్ మరియు సబ్ డివిజనల్ అటవీ అధికారి ఎన్.వి దివాకర్ ఆదేశాల మేరకు వనిపెంట రేంజ్ పరిధిలోని నల్లమల్ల రిజర్వు అడవిలోనికి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారని సమాచారం మేరకు, వనిపెంట అటవీ క్షేత్ర అధికారి జె ప్రణీత్ రావు ఉత్తర్వుల మేరకు వనిపెంట రేంజ్ సిబ్బంది అడవిలో కూబింగ్ నిర్వహిస్తుండగా కొంతమంది దుండగులు ఎర్రచందనం చెట్లను నరికి, దొంగలుగా మార్చి వాటి వాటి రవాణా చేయుటకు సిద్ధం చేస్తూ కనిపించారు. వారిలో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరు ముగ్గురు నీలాపురం గ్రామానికి చెందిన వారు. తదుపరి మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని రేంజర్ తెలిపారు. ఎవరైనా ఇటువంటి అటవి నేరాలకు పాల్పడిన, పాల్పడే వారికి సహకరించిన అటవీ చట్టాల ప్రకారం కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. ఈ కూబింగ్ ఆపరేషన్ లో డి ఆర్ ఓ అన్వర్ హుస్సేన్, బీట్ అధికారులు, సుచరిత, ఈశ్వరమ్మ, సురేంద్ర, మరియు ప్రొటక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**కె.వి పల్లి ,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**

మండలంలోని సొరకాయల పేట గ్రామపంచాయతీ మిన్నం రెడ్డి గారి పల్లెలో ఆదివారం శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం కొంతమందిని శాస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు ఈ వైద్య శిబిరంలో శిబిరం నిర్వాహకులు వంగిమల్ల శ్రీనివాసులు రెడ్డి సిబ్బంది సుబ్బారెడ్డి, సిద్ధారెడ్డి ,సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి సబిత



**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:**

ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ నందు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన్ శంకర్రావు ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ సవిత క్యాలెండర్ ఆవిష్కరణ, డైరీ ఆవిష్కరణ చేశారు. కడప జిల్లా అధ్యక్షులు బత్తుల లింగమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగాలపల్లి నటరాజ్, పస్సం అంజి, నరసింహ, సిద్దయ్య, హరి మంత్రిని శాలువాతో సన్మానించారు. కడపలో ఉన్నటువంటి బీసీ భవనం లో ఉండే సమస్యలను మంత్రిగారికి వివరించడం జరిగినది. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బిసి వార్డెన్ సేవలు ప్రశంసనీయం



**మదనపల్లె, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**

బిసి వార్డెన్ సేవలకు గుర్తించి అన్నమయ్యజిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ హాస్టల్ వార్డెన్ వెంకటేష్ ప్రశంసాపత్రం అందుకోవడంతో బిసి కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. విద్యార్థి రంగంలో ఎంతో మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతూ నిరంతరం సమాజ సేవలో ముందే బిసి హాస్టల్ వార్డెన్ వెంకటేష్ సేవలను ప్రశంసిస్తూ అవార్డు గ్రహీతకు ఆదివారం బిసి సంఘాల ఆధ్వర్యంలో యూత్ కరాటే క్లబ్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలనో యూత్‌కరాటే క్లబ్ అధ్యక్షులు ఏఆర్.సురేష్, పాల ఏకరి సంఘం నాయకులు జన్నే రాజేంద్రనాయుడు, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సుబ్రమణ్యం, వికలాంగుల సంఘం నాయకులు మౌళాలి, యాదవ సంఘం నాయకులు నరసింహాయాదవ్, రజకసంఘం నాయకులు వెంకటరమణ, తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

## వేమన సాక్షాత్తు దేవుడే అందుకే ఇకపై

# వేమన భగవాన్ అని పిలుపు

**సిద్దవటం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:**

త్రైత సిద్ధాంత అది రక్త, ఇందూ జ్ఞాన ప్రదాత శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరులు వారు రచించిన నిగూఢ తత్వార్థ బోధిని అనే గ్రంథం లో 110 వేమన పద్యాలకు ఆధ్యాత్మిక వివరం రాశారు. వేమన దైవాంశ సంభూతుడు అని వేమన భగవాన్ అని గ్రంథంలో కనుక నేటి తరం వేమన పద్యాలు మరియు త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వెల్లకొత్త సంగటిపల్లి, పెండ్లిమర్రి వెల్లటూరు గ్రామాలలో గురువు రాసిన వేమన గారి పద్య వివరణ కలిగిన నిగూఢ తత్వార్థ బోధిని గ్రంథం మరియు త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం ప్రచారం జరిగిందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ అధ్యక్షుడు డి.వరుణ్‌కుమార్ తెలిపారు. వేమన పద్యం వేయి విధాలు అర్థాలు అమరి ఉండవచ్చు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ అధ్యక్షుడు సభ్యుఉ వరుణ్‌కుమార్ గురుమూర్తి, పోతులూరు వెంకటయ్య హరి శివ, నరహరి, నరసింహ, కృష్ణవేణి, ద్రాక్షాయణి, నాగేశ్వరి, మనోహర, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ కొనలేం..తినలేం-కొండెక్కిన చికెన్ ధరలు

### బాయిలర్ కిలో రూ.200 - నాటుకోడి రూ.600

### ఆందోళనలో సామాన్య ప్రజలు

**మదనపల్లె, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**

చికెన్ ధరలు ఆకాశానంటుతున్నాయి. సామాన్యులకు చికెన్ అందుబాటులో లేకుండా పోతోంది. కొనలేం తినలేమంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బాయిలర్ చికెన్ కిలో రూ.200లు ధర ఉండగా, నాటుకోడి చికెన్ రూ.600లు ధర పలుకుతోంది. సాధారణంగా వేసవిలో చికెన్ ధరలు తగ్గుముఖం పడుతాయి. అలాంటిది ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్యులకు చికెన్ బంగారులా ఉంటొంది. చికెన్‌లో కూడా నాలుగు రకాల మాంసం ఉండడంతో చికెన్ సెంటర్లలో వివిధ రకాల ధరల పట్టికను ఏర్పాటు చేశారు. స్కిన్‌లెస్ చికెన్, బాయిలర్, బోన్‌లెస్, గిరిరాజా లాంటి చికెన్‌లు ఉన్నాయి. వీటితో పాటు నాలుకోడి చికెన్ కూడా డిమాండ్ ఉండడంతో ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. కోళ్ళు ఉత్పత్తి తక్కువుగా ఉండడం వల్లే ధరలు పెరిగాయంటూ వ్యాపారులు చెబుతున్నారు. వేసవిలో కోళ్ళ పరిశ్రమలో ఎండల తాకిడికి కోళ్ళు తూకం తగ్గడం, ఉత్పత్తి ఘననీయంగా పడిపోవడం వల్లే ధరలు ఆకాశానంటుతున్నాయి. సాదారణంగా మాంసాహారాలు చికెన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇక పొట్టేళ్ళు, మేకపోతుల మాంసం కూడా అధిక ధరలకే విక్రయిస్తున్నారు. కిలో మాంసం రూ.750 నుంచి 800ల వరకు విక్రయిస్తున్నారు. ఆదివారం రోజు మాంసం క్రయ విక్రయాలు పట్టణాల్లో జోరుగా జరుగుతాయి. ధరల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలంటూ పలువురు కోరుతున్నారు. కోడిగుడ్డుల ధరలు కూడా అధికంగానే ఉంటున్నాయి. కోడిగుడ్డు ధర రూ.6.50పైసలకు విక్రయిస్తున్నారు. చేపలు ధరలు కూడా ఎక్కువుగానే ఉంటున్నాయి. మదనపల్లె డివిజన్ పరిసర ప్రాంతాల్లో చాపలు పెంపకం తక్కువుగా ఉండడం వల్ల ధరలు పెరిగాయంటూ వ్యాపారస్తులు చెబుతున్నారు. నెల్లూరు, చెన్నైలకు చెందిన సముద్రపు చాపలు ఇక్కడికి తీసుకొచ్చి వ్యాపారస్తులు విక్రయిస్తుంటారు. కొరమీన కిలో రూ.1000నుంచి 900ల వరకు విక్రయిస్తారు. వీటిని కొనుగోలు చేసేందుకు కూడా సామాన్యులు బెబ్బేలు చెందుతున్నారు. ఇక రొయ్యలు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో లేకుండాపోతున్నాయి. పట్టణంలో మాంసపు విక్రయదారులకు మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. మాంసపు ధరలు ఎక్కువుగా ఉండడం వల్ల ప్రజలు కూరగాయలు, ఆకుకూరలపై దృష్టి మళ్ళిస్తున్నారు. కూరగాయల ధరలు తక్కువుగా ఉండడం వల్ల ప్రతి ఒక్కరూ వీటిపైనే మక్కువ చూపుతున్నారు.



## హిజ్రాల సంఘం నాయకురాలు మృతి



**మదనపల్లె, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**

మదనపల్లె హిజ్రాల సంఘం నాయకురాలు సుబ్బమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. మదనపల్లె మండలం, పుంగనూరు రోడ్డు హిజ్రాల కాలనీలో సుబ్బమ్మ నివాసం ఉంటోంది. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం మృతి చెందారు. ఈమె మృతికి మదనపల్లెలోని హిజ్రాలు సంతాపం తెలిపారు. సుబ్బమ్మ మరణవార్త తెలియగానే హిజ్రాల సంఘం తరపున నియోజకవర్గంలోని హిజ్రాలు పలువురు ఆమె ఇంటికి చేరుకొన్నారు.

## ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రహ్లాద్



**బద్వేలు రూరల్, ఫిబ్రవరి 2 ,ప్రభాతవార్త**

జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీలలో విశాఖపట్నం లో జరిగిన ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర మహాసభలలో ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) రాష్ట్ర జిల్లా నూతన బాధ్యతల నియామకం జరిగింది. ఇందులో భాగంగా బద్వేల్ నియోజకవర్గ కన్వీనర్ గా పనిచేస్తున్న ప్రహ్లాద్‌ని కడప జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర అధ్యక్షులుగా మల్లవరపు అశోక్ రెడ్డి ని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో కడప జిల్లా అధ్యక్షుడిగా నియమించినటువంటి రాష్ట్ర అధ్యక్షులు అశోక్ రెడ్డి కి,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకా ప్రసాద్ కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కరించడంలో మరియు జిల్లాలో ఆంధ్ర విద్యార్థి సంఘం పనిని మరింత చురుకుగా పెంచడంలో ముందుంటూ సంస్థ తీసుకునే ప్రతి నిర్ణయానికి అనుకూలంగా పనిచేస్తానని, ఆంధ్ర విద్యార్థి సంఘం సిద్ధాంతాలకు కట్టుబడి అందర్నీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి సంఘ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## క్యూఆర్ కోడ్ ద్వారా

# విద్యుత్ బిల్లులు చెల్లింపు

**దువ్వూరు, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త:**

విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ శాఖ వారు విద్యుత్ బిల్లులు చెల్లింపునకు క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించవచ్చు అని మండల విద్యుత్ శాఖ ఏఈ వీరారెడ్డి తెలిపారు. ఈ నెల మొదటి వారం నుంచి ఈ కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ ప్రవేశఫెట్టిందన్నారు. విద్యుత్ బిల్లు కింద కింది బాగంలో క్యూఆర్ కోడ్‌ను ముద్రించి ఉన్నారని చరవాణిలో ఉన్న ఫోన్ పూ, గూగుల్ పే, పేటియం ద్వారా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే యజమానికి చెందిన విద్యుత్ మొత్తం బిల్లు కనిపిస్తుందని దానిని వెంటనే చెల్లించవచ్చు అన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ సౌకర్యం ద్వారా ఇంటి వద్ద నుంచే బిల్లు చెల్లించవచ్చు అని ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని ఏఈ తెలిపారు.

# మహిళ హత్య



**పులివెందుల, ఫిబ్రవరి 2, ప్రభాతావార్త :**

వేముల మండలంలోని కె. కె.కొట్టాల గ్రామానికి చెందిన సింగంశెట్టి పద్మావతి(50) దారుణ హత్య గురైంది. మృతురాలి భర్త సుబ్బరాయుడు తెలిపిన వివరాల ప్రకారం సింగంశెట్టి పద్మావతి ఆదివారం ఉదయం 10 గంటలకు సమయంలో గేదెలను మేత కోసం తోలుకొని సమీపంలోనీ కొండల్లోకి వెళ్లిందని మధ్యాహ్నం సమయంలో ఎవరో గుర్తు తెలియని దొంగ ఆ కొండ సమీపంలోని తోటలో మోటార్ స్టాటర్ దొంగతనానికి వచ్చాడని ఆ దొంగను అదే ప్రాంతంలో మరో మహిళ గట్టిగా కేకలు వేయడంతో ఆ దొంగ కొండ ప్రాంతంలోకి వెళ్లాడని ఊర్లో అనుకుంటుండగా నా భార్య మెడలో గొలుసు కమ్మలు ఉన్నాయని ఎక్కడ దొంగ దాడి చేసి తీసుకెళ్తాడో అని భయపడి అదే కొండ ప్రాంతంలోకి వెళ్లి గాలించగా కొండ కింద ప్రాంతంలో తీవ్ర గాయాలతో చనిపోయి ఉందని చెప్పారు. అయితే మృతురాలి మెడపై తలపై గాయాలు ఉండడం చూసి పరిశీలించగా మెడలోని గొలుసు, కమ్మలు, ఉంగరం లేవని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు మహిళపై దాడి చేసి ఆమె ఒంటి మీద ఉన్న నగలను దొంగలిచారని అనుమానం వ్యక్తం చేశారు. అయితే విషయం తెలుసుకున్న సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలిని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టి సంఘటనా స్థలం నుంచి పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అయితే మృతు రాలి బట్టలు చిందరవందర గా ఉండడంతో ఆమెపై అత్యాచారం చేసి అనంతరం చంపి ఆమె నగలను తీసుకొని పారిపోయి ఉండవచ్చనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. హత్యవిషయం తెలుసుకున్న పార్టీ నాయకులు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు నాగేళ్ల సాంబశివరెడ్డి, జడ్పిటిసి కోకటం వెంకట బయపు రెడ్డి, తెదేపా నాయకులు మబ్బు చింతలపల్లి శ్రీనాథ్ రెడ్డిలు పరామర్శించారు. ఈ విషయం పై పిర్యాదు చేసుకొని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 4న శ్రీనిత్య పూజ స్వామి

# తలనీలాల వేలం పాట

**సిద్దవటం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామం లంకమల అడవుల్లో వెలసిన శ్రీ నిత్య పూజ స్వామి దేవస్థానం సంబంధించిన మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 25 నుంచి 27 వరకు భక్తాదులు సమర్పించే తలనీలాల వేలం పాట ఈనెల 4న 11 గంటలకు సిద్దవటం శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని కార్యనిర్వహణాధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదలచినవారు తలనీలాలకు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. తలనీలాలకు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు పూర్తి మొత్తం చెల్లించి అచ్చు (డిపాజిట్‌తో కలిపి) రశీదు పొందాలన్నారు. మిగిలిన షరతులు వేలం పాట సమయంలో తెలియజేస్తామని తెలిపారు.


**YERRAGUNTLA NAGARA PANCHAYAT**
**(Short Tender Notice)**

**'e' Procurement Tender Notice No. 10/E1/2024-25/E1 and 21/1FC/E1/2023-24 (2nd call) to 22/15FC/E1/2023-24 (2nd call)** Dt.31.01.2025

District Mineral Foundation Trust Grant 2024-25, 15th FC Grant (1st & 2nd Installment) 2020-21

| | |
|---|---|
| Est.Cost (4 No.of works) : 115.61 Lakhs | |
| Bid Document Downloading Start Time | : 01.02.2025 @10.00 AM. |
| Bid Document Downloading end date | : 04.02.2025 @ 4.00 PM. |
| Last date/Time of receipt of Tender | : 04.02.2025 @ 5.00 PM. |

Contact: Commissioner, Yerraguntla Nagar Panchayat - 9000103129
Further details can be seen @ 'e' Procurement market place @ https://tender.apeprocurement.gov.in
Assistant Engineer, Contact No.82972 32999/9100803060.

Commissioner
Yerraguntla Nagara panchayat.

# రాముడి బాటలో నడుద్దాం సమరసత సమాజాన్ని ఐక్యం చేద్దాం



మైదుకూరు, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త:
విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర సామాజిక సమరసత యాత్రలో భాగంగా మైదుకూరు వనిపెంట రోడ్డు బ్రహ్మంగారి ఆశ్రమానికి చేరారు. ఈ యాత్ర ముఖ్య ఉద్దేశం సమరసత అంటరానితనాన్ని కుల వివక్షను రూపు మాపి రాముడు బాటలో మన మందరం నడుస్తూ హిందూ సమాజాన్ని, ధర్మాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలు రాబోయే తరాలకు అందించాలని యాత్రలో భాగంగా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంఘటన శ్రీనివాసరెడ్డి,అభినవ శంకరానంద స్వామీజీ చాగలమర్రి ఆశ్రమం,లక్ష్మీపతి స్వామీజీ బండి అన్న ఆశ్రమం(బి.కోట ఆశ్రమం), స్వామీజీలు పెద్దలు మాట్లాడుతూ గడప లోపల కులం గడప బయట మనమంతా హిందువులం అనే భావనతో ఐక్యతను పెంచాలని ప్రతి కుటుంబంలో శివాజీ లాంటి వారు ఉండాలని ఈ భారతదేశంలో ముక్కోటి దేవతలు ఉన్న పుణ్య దేశం శ్రీరామ చంద్రుడు చంద్రుడు కాదా అయినా మతాల పేరుతో పరాయి దేశస్తులు విడదీసి పాలించడంతో ఇలా ఉన్నామని భూమి మీద తల్లి బిడ్డలముగా పుట్టి విడిపోతున్నాం హైందవ మతంలో పుట్టి కులాలుగా విడిపోతున్నాం. ధర్మం వైపు నడుస్తూ ధర్మాన్ని పాటిస్తూ అందరినీ కలుపుకొని పోవాలి రాముడు, శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పిన బాటలో మనము కూడా పాటిద్దాం మన జాతి సంస్కృతి సాంప్రదాయాలు పాటిద్దాం సమాజాన్ని ఏకదాటిపై నడిపిద్దాం మనల్ని కులాలుగా విభజించి పాలించిన వారు మనం అందరం కలిస్తే ఏకమవుతామని ఉద్దేశంతో 75 సంవత్సరాలు గడిచిన ఇంకా అదే దారిలో ఉన్నాం. జాతి సమైక్యత ధర్మం కిందిస్థాయికి చేరాలంటే చిన్నపిల్లల దగ్గర నుండి అందరి హృదయాల్లో భేద భావన లేకుండా జాతిని ఏకం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఎస్సీ ఎస్టీ కులాలతో పూర్వం లాగే మనమంతా భరతమాత ముద్దు బిడ్డలం భావనతో ఐక్యతను పెంచాలని అంటరానితనాన్ని రూపుమాపి రామ ధర్మాన్ని పాటిస్తామని ఉపదేశించారు. సమరసత భావాన్ని దేశమంతా విస్తరింపజేసే క్రమంలో భాగంగా విశ్వహిందూ పరిషత్ అఖిలభారత యోజనతో జరుగుతున్న సామాజిక సమరసత యాత్ర యొక్క ఉద్దేశాన్ని ప్రజలకు తెలియజేసే విధంగా మన నిత్యజీవితంలో సమరసత వెల్లివిరిసేలా అనాదిగా వస్తున్న కులవివక్షను రూపుమాపి హిందూ సమాజాన్ని నిర్మించడం కోసం అంతర్గత సమస్యని మనమే పరిష్కరించు కోవడం కోసం ఈ సమాజాన్ని సంసిద్ధం చేసేందుకు సామాజిక సమరసిత యాత్ర మైదుకూరులో జరిగింది. దీని అర్థం చేసుకొని హిందూ సమాజం మొత్తం ఆ బాటలో పయనించే విధంగా మనందరం సరైనటువంటి ప్రతినిధులుగా జీవించే ప్రయత్నం చేసే విధంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం రచించిన బనగానపల్లె నుండి బ్రహ్మంగారు జీవ సమాధి బ్రహ్మంగారిమఠం వరకు ఆరు రోజులుగా చేపట్టిన సామాజిక సమరసతా యాత్ర మైదుకూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సామాజిక సమరసత యాత్ర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు బిజెపి కన్వీనర్ మాచనూరు. సుబ్బరాయుడు, సుధాకర్, వెంకటేశ్వర్లు, మాధవి లత,టీచర్ పుల్లయ్య, రామ నాయక్, పెద్దయ్య, నరసయ్య, సుబ్రహ్మణ్యం, నాయుడు, విశ్వహిందూ పరిషత్ సమరత సేవ ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నజీరుల్లాషా ఆస్తుల అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు జనవరి 2, ప్రభాతవార్త
పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న నజీరుల్లా షా మఠం యొక్క ట్రస్ట్ ఆస్తులను పరిరక్షణ కమిటీ అభిప్రాయం మేరకు నజీరుల్లా షా ఆస్తుల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి హామీ ఇచ్చారు. గతంలో పెద్దలు ప్రొద్దుటూరు ప్రజల అభివృద్ధికై సుమారు రెండు ఎకరాల స్థలాన్ని ట్రస్టుకు వ్రాసి ఇచ్చినట్లు తెలిపారు. వారు ఎంతో మంచి సంకల్పంతో సమాజానికి మేలు చేయాలని ఇంతటి స్థలాన్ని అందించిన మహనీయులుగా ఆయన కొనియాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా ఈ విధంగా ట్రస్టులకు ఇచ్చే దాతలు లేరన్నారు. ఇటీవల నజీరుల్లా కుటుంబ సభ్యులు కొందరు ఈ స్థలాన్ని విక్రయించాలని చూసిన మాట వాస్తవమన్నారు. మైనార్టీ నాయకులు వి ఎస్ ముక్తియార్ నజీరుల్లా కుటుంబ సభ్యులు దానంగా ఇచ్చిన స్థలాన్ని విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని తన దృష్టికి తేగా వెంటనే విక్రయించడానికి వీలు లేకుండా చేశామన్నారు. ప్రస్తుతం ఈ స్థలము ఒక ఎకరా ఐదు సెంట్లు మిగిలి ఉన్నదని అందులో ఏ రకంగా అభివృద్ధి చేయాలో ట్రస్ట్ పరిరక్షణ కమిటీ తిరిగి మరొకసారి సమావేశమై నిర్ణయం తీసుకొని తన దృష్టికి తెస్తే వారి అభిప్రాయాలకు అనుగుణంగా తాను అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. పరిరక్షణ కమిటీ సభ్యులను ఎన్నుకోవడంలో జాగ్రత్త వహించి సేవా తత్పరులను ఎన్నుకోవాలని సూచించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు మాట్లాడుతూ నజీరుల్లా షా ట్రస్టు అభివృద్ధికి సహకారస్తానని స్థలానికి సంబంధించి కాంపౌండ్ వాల్ నిర్మించుకునేందుకు పది లక్షల విరాళం ఇస్తానని ప్రకటించారు. టిడిపి మైనారిటీ నాయకులు వి ఎస్ ముక్తియార్ మాట్లాడుతూ ఎంతో మంచి సంకల్పంతో ఆనాడు మా పెద్దలు ప్రొద్దుటూరు పట్టణ సమాజానికి స్థలాన్ని ఘనంగా ఇచ్చారని ఆ స్థలం అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డికి 10 లక్షలు విరాళం ప్రకటించిన సీఎం సురేష్ నాయుడుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మరోసారి తిరిగి సమావేశమై ఏ రకంగా అభివృద్ధి చేయాలో నిర్ణయం తీసుకొని పెద్దల ముందు ఉంచుతామని ఆయన పేర్కొన్నారు ఈ సమావేశంలో ముస్లిం మత పెద్దలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# 2029లో మళ్ళీ చంద్రబాబు సీఎం



పులివెందుల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :
2029లో మళ్లీ చంద్రబాబునాయుడు అధికారం చేపడతారని తెదేపా నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుగుట్ల మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆదివారం మధుసూదన్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతుందని ఈ ఎనిమిది నెలల్లో పులివెందులలో కొన్ని సంవత్సరాలగా జరుగుతున్న మట్కా నిషేధించి, అలాగే ఉచిత ఇసుక ,మైనింగ్ అక్రమ రవాణా కాకుండా అడ్డుకట్ట వేశామన్నారు. ఈ ప్రాంతం నీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతుందని రైతులు నీరు లేకపోతే పండిన పంటలు కూడా ఎండిపోయే స్థితికి వస్తున్నాయని వెంటనే పులివెందుల ప్రాంతానికి నీరు వచ్చే విధంగా చేయాలని అప్పటి తెదేపా నాయకులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లగానే రైతుల ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో కోటి రూపాయలు పైగా వెచ్చించి ఈ ప్రాంత రైతాంగం ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో నీరు ఇవ్వడం కూడా జరిగిందన్నారు. మేము చెప్పిన ప్రతి పథకం తప్ప కుండా దశల వారీగా అమలుచేస్తామని పులివెందుల లో వున్న ప్రతి అభివృద్ధి, సమస్యని మా సమస్యగా భావించి తప్పకుండా మిగిలిన పనులని పూర్తి చేసి అబివృద్ధికి తాము కూడా కృషిచేస్తామని అన్నారు. అలాగే 2019 లో వైసీపీ అధికారం లోకి వచ్చాక నేను ఇంటిలో ఉంటే నేను గొడవలు చేశానని టీడీపీ పార్టీ ఆఫీసులో వున్న జీపు కాలిపోతే నాపై 307 లాంటి పెద్ద కేసులు పెట్టి నన్ను, నా కుటుంబాన్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టారని ఇంతటి దుర్మార్గపు వైసిపి ప్రభుత్వాన్ని ఎక్కడ చూడలేదన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు అభివృద్ధిలో భాగమై పులివెందుల నియోజకవర్గ అభివృధి లో అడుగెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు సుబ్బారెడ్డి, అంకాల్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో ఏపికి నిల్,బీహార్‌కు ఫుల్

## నిరసన దీక్ష లో పాల్గొన్న తులసి రెడ్డి.



వేంపల్లి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :
కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కడప జిల్లాకు, రాయలసీమకు, రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా ఆదివారం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని, నల్ల జెండాలతో నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.తులసి రెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగినట్లే ఈ సారి కూడా కేంద్ర బడ్జెట్‌లో కడప జిల్లాకు, రాయలసీమకు, రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం కేంద్రంలో మోడీ ప్రభుత్వ మనుగడ టిడిపి మీద ఆధారపడి వుంది కనుక ఈ సారి రాష్ట్రానికి తప్పక న్యాయం జరుగుతుందని అందరూ భావించారని, కానీ అందుకు పూర్తి విరుద్ధంగా జరిగిందన్నారు. ప్రజల ఆశలు అడియాశలయ్యాయని తెలిపారు. విభజన చట్టంలో 13 వ షెడ్యూల్ ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగాలని, దీనికి కావలసిన భూమి, నీరు, విద్యుత్ శక్తి, రవాణా సౌకర్యాలు, ముడి పదార్థాలు అన్నీ జిల్లాలో వున్నాయని, కానీ నిర్మాణానికి నోచుకోలేదన్నారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వాల్సి ఉండగా, ఇవ్వలేదని, ఈ సారి కూడా కేంద్ర బడ్జెట్ లో దీని ప్రస్తావనే లేదన్నారు. కేంద్ర బడ్జెట్ బీడి బడ్జెట్ గా వుందని తులసి రెడ్డి ఎద్దేవా చేశారు. బీ అంటే బీహార్, డి అంటే డిల్లీ అన్నారు. ఇందుకు నిరసనగా ఆదివారం వేంపల్లి లో కాంగ్రెస్ పార్టీ నిరసన దీక్ష చేపట్టినట్లు తులసి రెడ్డి తెలిపారు. ఈ నిరసన దీక్ష లో కాంగ్రెస్ నాయకులు రామాంజనేయ రెడ్డి, ఉత్తన్న,బద్రి నాథ్, వెంకటేష్, మహబూబ్ బాషా, రవి, వినయ్, అయిచర్ రమణ, సాయి, శ్యాం, దిలీప్, కిరణ్, విజయ్, పాపయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నివర్గాలకు ప్రయోజనం



కడప ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:
దేశ ఆర్థిక మంత్రి శ్రీ నిర్మలా సీతారామన్ నిన్న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ గ్రామీణ రైతులు, పేదలు, ఉద్యోగస్తులకు మరియు అన్నివర్గాలకు ప్రయోజనం కలిగించే విధంగా మరియు భారతదేశం అభివృద్ధిలో ఇంకా ముందుకు తీసుకెళ్లేలా ఉందని కమలాపురం బీజేపీ కన్వీనర్ శ్రీ గుత్తిరెడ్డి చంద్రమోహన్, మాజీ జిల్లా కన్వీనర్ భరత్ రెడ్డి తెలియజేయడం జరిగింది.

# నేటి నుండి రహమతుల్లా అలైహి ఉరుసు

చిన్నమండెం ఫెబ్రవరి 2 ప్రబాతవార్త;
మండలంలోని చావిడికుంట కుంట దర్గాలో వెలసిన హజరత్ షా ఆలీ గంజే షాహీద్ బాబా రహమతుల్లా అలైహి ఉరుసు నేటి నుండి అంగరంగ వైభవంగా జరగనున్నట్లు దర్గా కమిటి సభ్యులు తెలిపారు.3 వ తేది గంధము 4 వ తేది లక్నో బాంబే వారిచే గొప్ప కవ్వాలి పోటీలు వుంటాయని తెలిపారు. హజరత్ ఖాజా సయ్యద్ షా ఆరీఫుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేని చిట్టి వుల్ ఖాదిరి చే పాతేహా జరుగుతుందని కావున ఉరుసు కార్యక్రమంలో వేలాదిగా పాల్గొని తరించాలని కోరారు. 3 వాతేది పెద్దయత్తున అన్నదాన కార్యక్రమం, 5 వ తేది సాయంత్రం కిష్టి లూటి వుంటుంది.

# ఘనంగా గురుకుల పాఠశాల వార్షికోత్సవం



కె.వి.పల్లి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :
మండలంలోని గ్యారంపల్లి గురుకుల జూనియర్ కళాశాలలో 31వ వార్షికోత్సవ దినోత్సవ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా మాజీ ప్రిన్సిపాల్స్ నారాయణమ్మ, శ్రీ ఎస్ వి శివయ్య, డాక్టర్ ఎస్ వి శ్రీధర్, చంద్రా రెడ్డి హాజరై విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగించారు. వార్షికోత్సవ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒక టాయిలెట్ బ్లాక్ ను పూర్వ అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ చందాలతో నిర్మించి ప్రారంభోత్సవం చేశారు. విద్యార్థులకు చక్కటి సదుపాయాలను వినియోగించుకుని కళాశాలకు గత సంవత్సరం మాదిరిగానే నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల లో అత్యధిక మార్కులు సాధించిన వారిని సన్మానించి అదేవిధంగా వివిధ క్రీడలలో రాణించిన విద్యార్థులకు బహుమతులు ప్రిన్సిపాల్ డా.యం. చెన్నకేశవులు, ముఖ్య అతిథులు, ప్రత్యేక ఆహ్వానితులు ప్రధానం చేశారు. వార్షికోత్సవ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.రామకృష్ణ ఆంజనేయులు, డాక్టర్ రమాదేవి, శేఖర్, అన్నపూర్ణ, హరినాథ్, నాగరాజు, రామకృష్ణ, తనూజ, నాగేంద్ర, హరిప్రియ, సౌజన్య, షకీల్ అహ్మద్, కొండల్ రావు, కొండయ్య, సయ్యద్ బాషా, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ నాయక్ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# నాగరాజుకు ఘన సన్మానం

లక్కిరెడ్డిపల్లి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త
జాతీయస్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీలలో 74వ కిలోల విభాగంలో 450 కేజీల బరువు ఎత్తి ఆంధ్ర రాష్ట్రం తరఫున గోల్డ్ మెడల్ ప్రథమ స్థానం సంపాదించిన మేడిమాకుల గుంతకు చెందిన కొర్లకుంట నాగరాజు కు లక్కిరెడ్డిపల్లి తెదేపా కార్యాలయంలో ఆదివారం రాజంపేట పార్లమెంట్ డాక్టర్ల సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లగుంట నాగరాజా జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం మన లక్కిరెడ్డిపల్లి ప్రాంతానికి గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సాధించాలని ఇతనికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడి ప్రభుత్వం తరఫున మరింత ప్రాధాన్యత నిచ్చే విధంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మన ఊరికి మంచి పేరు తేవాలని తెలిపారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు కొలిమి పక్కీరయ్య, మాజీ ఎంపీటీసీ గోవిందు వెంకటేష్ దప్పేపల్లి, మసూద్, అహ్మద్, లక్ష్మయ్య, వెంకటేశు మిత్రులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు కూటమి ప్రభుత్వం దగా



వాల్మీకిపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :
రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఫీజు రి ఎంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులకు దగా చేసిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఫీజు రియంబర్స్మెంట్ ఉద్యమ బాట పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ .3900 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విద్యాసంస్థలకు చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఫీజులు చెల్లించలేక తీవ్ర అవస్థలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పెద్దలు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాలను తుంగలో తొక్కి ప్రజల్ని విద్యార్థులను, మహిళలను, రైతులను మోసం చేశారని, డైవర్షన్ పాలిటిక్స్ కు ఇస్తున్న ప్రాధాన్యత సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో ఇవ్వాలన్నారు. కూటమి పెద్దలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోక పోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపు విషయమై విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం దుర్మార్గమని, ఈ విషయమై ఈనెల 5న రాయచోటిలో జిల్లా స్థాయిలో ఉద్యమ బాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు, విద్యార్థుల తల్లి దండ్రులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి చింతల శివానందరెడ్డి, జిల్లా టెలిఫోన్ సలహా సంఘం సభ్యుడు శ్రీధర్ రాయల్, మండల వైసీపీ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, నాయకులు కె. నరసింహులు,కువైట్ ఇబ్రహీం, సురేష్ రెడ్డి, శివారెడ్డి, రఘు, ముని భాస్కర్, రవి, మహబూబ్‌బాషా, చికెన్ మస్తాన్, సైపుల్ల, చలపతి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లికి పూజలు



లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 02 ప్రభాతవార్త
మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం బీరంగి కొత్తకోట బండెన్న పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు యాదవ్, చెల్లు దినేష్ యాదవ్‌లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం బీరంగి బండెన్న పీఠాధిపతి లక్ష్మీపతి స్వామికి ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసులు, ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు యాదవ్, చెల్లు దినేష్ యాదవ్‌లు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో స్వామి వారికి దుశాలవతో సన్మానించారు భక్తులు క్యూ లైన్లో వెళ్లి అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు దినేష్ యాదవ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, మార్కండేయ, నాగేశ్వరి సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# ముగ్గు రాయి అక్రమ మైనింగ్‌ని అరికట్టాలి

## ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి



పులివెందుల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :
కడప జిల్లాలో ముఖ్యంగా వేంపల్లి, వేముల, పెండ్లిమర్రి, మండలాలలో వేల కోట్ల రూపాయల ముగ్గు రాయిని కొల్లగొడుతూ వారి ఆర్థిక సామ్రాజ్యాలు నెలకొల్పుకుంటూ రాజకీయాలు చేస్తున్నారని ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఇదే వేముల మండలానికి చెందిన ఒక వ్యక్తి ఇదే విధంగా 200 కోట్ల రూపాయల ముగ్గురాయి ఖనిజాన్ని దోచుకుని ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించు కున్నాడని అన్నారు. అక్రమ గని తవ్వకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని అప్పటి ప్రభుత్వ పెద్దలకు వాటాల రూపంలో ఇచ్చుకున్నాడన్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మైనింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం రాజకీయాలు చేయకుండా అక్రమార్జన కోసం రాజకీయాలు ఉపయోగించుకుంటూ, గత ప్రభుత్వంలో తనకున్న కొద్దిపాటి విస్తీర్ణంలో మైనింగ్ మొదలుపెట్టి సమాంతరంగా ఇతరుల అనుమతులు లేని మైనింగ్ లోకి చొరబడి ఖరీదైన 200 కోట్ల రూపాయల ఖనిజాన్ని దోచుకున్న వ్యక్తిపై సమగ్ర విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం కూడా కూటమి ప్రభుత్వంలోని వేముల మండలానికి చెందిన కొందరు నాయకులు అదే విధానాన్ని పాటిస్తూ కోట్లు కొల్లగొట్టాలని ప్రయత్నంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారని అన్నారు. అధికారులు మిన్నకుండి పోవడం వల్ల ఈ వ్యవహారాలన్నీ కూడా సాగుతున్నాయన్నారు. కావున అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని లేనియెడల ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమం చేయటంలో వెనకడుగు వేయబోమని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భాను ప్రకాష్, అసెంబ్లీ కన్వీనర్ తేరా మహేశ్వర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షుడు వై.నవీన్, విష్ణు ,కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు పగడాల రాజశేఖర్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

పుల్లంపేట: ఫిబ్రవరి 2( ప్రభాతవార్త)
పుల్లంపేట మండలంలో వత్తలూరు పంచాయతీమల్లం వారి పల్లె గ్రామంలో బొజ్జరెడ్డి సుబ్బారెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కును ఎమ్మెల్యే అరవ అరవ శ్రీధర్, వరలక్ష్మి చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేయడం జరిగింది. అలాగే మండలంలోని గ్రామాల్లో సిమెంట్ రోడ్లకు రైల్వేకోడూరు శాసనసభ్యుడు ఆరవ శ్రీధర్, కూడా చైర్మన్ రూపనందర్ రెడ్డిలు భూమిపూజ కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో ఐదు లక్షల రూపాయలకు, కోనయ్యగారి పల్లి గ్రామపంచాయతీలో కొమానపల్లి దళితవాడ, అరుంధతి వాడల్లో 6 లక్షల రూపాయల నిధులతో ఈ భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు సుధాకర్ ఉపాధ్యక్షుడు కాపర్ల చంద్రశేఖర్ నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు హోటల్ నాయుడు, లింగొట్ల వెంకటరమణ, వెంకటసుబ్బయ్య యాదవ్, చిన్నం శివయ్య, భీమ చంద్రశేఖర్ రెడ్డి, వత్తలూరు ఈడిగపల్లె కుచెందిన టిడిపి నాయకుడు మోహన్, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



అట్లూరు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :
మండలంలోని అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద రెడ్డి మెడికల్ స్టోర్ వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత ప్రత్యేక కంటి వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. అట్లూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలు సుమారు 150 మంది కంటి చూపు లోపాలపై వైద్య పరీక్షలు చేయించుకున్నారు . స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో కడప పుష్పగిరి కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు శివకృష్ణ, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లెం శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



పెద్దమండెం ఫిబ్రవరి 2 ప్రభాత వార్త
లక్ష డబ్బులు వేల గొంతుకలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చినబాబు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని మన్యం హరిజనవాడలో ఆదివారం సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7న హైదరాబాదులో జరిగే ఎస్సీ వర్గీకరణ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగు మహాసభను డప్పు కార్మికులు మాదిగలు పూర్తిస్థాయిలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణను చేయాలని మందకృష్ణ మాదిగ పోరాడుతున్నారని దాని కలను సహకారం చేసుకోవడానికి పెద్ద ఎత్తున డప్పు కార్మికులు మాదిగలు పూర్తిస్థాయిలో హాజరై మన జన వానిని ఢిల్లీ పెద్దలకు తెలిసే విధంగా గర్జించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ మహిళా నాయకులు రాములమ్మ మాదిగ జయమ్మ మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు తిరుపాల్ మాదిగ వెంకట చిన్నప మాదిగ డీలర్ మల్లయ్య డప్పు కార్మికులు వేమ నారాయణ శ్రీరాములు ఎం ఎస్ పి నాయకులు మహేష్ రాజేందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వావిలికోలను సుబ్బారావు జయంతి



ఒంటిమిట్ట పిభ్రవరి2 ప్రభాతవార్త:
ఆంద్ర వాల్మీకి వావిలికోలసు సుబ్బారావు జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఒంటిమిట్టలోని శృంగేశైలం పర్వతం నందు గల వావిలికోలను సుబ్బారావు ఆశ్రమంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువ జామునే సుబ్బారావు విగ్రహాలనికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నరసింహాచార్యులు అభిషేకం చేసి ప్రత్యేక పూలతో ఆలకరించారు. వావిలికోలసు సుబ్బారావు కోదండ రామాలయ అబివృద్ధికి ఎనలేని సేవ చేశారు. ప్రభుత్వం ఉద్యోగానికి రాజీనామాచేసి ఒంటిమిట్ట కోదండరామునికి లక్షలాదిరూపాయలను సేకరించి కోదండ రామాలయానికి ఆందజేశారు. టెంకాయ చిప్ప చేత పట్టి లక్షలాదిరూపాయాలు, పోలాలు స్వామివారి ఆలయానికి ఆందజేశారు. ఈయన జయంతి వేడుకలు ప్రతి ఏడాది టిటిటి వారు అత్యంత వైభంగా నిర్వహిస్తున్నరు. ఆదివారం పలువులు భక్తులు విచ్చేసి సుబ్బారావు విగ్రహాన్ని దర్శించుకోని పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పర్వతంపై శనివారంనుంచి ఆదివారం వరకు ఆఖండ భజనలు చేస్తున్నరు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆర్చకులు, భక్తులు, టిటిడి ఆదికారులు పాల్గోన్నారు.

# ఆక్షరాభ్యాస మహోత్సవానికి శంకర్‌కు ఆహ్వానం

ఒంటిమిట్ట పిభ్రవరి2 ప్రభాతవార్త:
ప్రొద్దుటూరులోని సరస్వతి విద్యామందిర్‌లో ఈనెల30 వతేదీన జరగనున్న వసంత పంచమీ ఆక్షరాభ్యాస మహోత్సవానికి తనకు ఆహ్వానం ఆంది నట్లు పోతన సాహిత్యపీఠం ఆద్యక్షుడు పసుపులేటి శంకర్ తెలిపారు. ఈ మహోత్సవ వేడుకలలో ఆద్యాత్మిక ప్రసంగము చేయమని వారి నుంచి ఆహ్వానం వచ్చినట్లు తెలిపారు. 30 వతేదీన ఉదయం నుంచి పలు ఆద్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని ప్రవచన, సాంస్కతిక భజనలు వుంటాయని తెలిపారు.

# చలో విజయవాడ జయప్రదం చేయండి



ప్రొద్దుటూరు. ఫిబ్రవరి 2. ప్రభాతవార్త
ఈనెల 5 వ తేదీన తెలుగు రాష్ట్రాల ఏపీ ఎమ్మార్పీఎస్ చైర్మన్ పేరుపోగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్ హాల్ నందు జరిగే జాతీయ సమావేశం జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ప్రొద్దుటూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తప్పేట శివ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సంజీవ్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి మిద్దె వెంకటరమణ, అధికార ప్రతినిధి తప్పేట హరిబాబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:
కమ్మ సామాజిక వర్గాల వారి సమస్యలు పరిష్కరిస్తామని, అలాగే వెనుకబడిన వారికి ఆర్థికంగా చేయూతన అందిస్తామని కమ్మ సంక్షేమ సంఘం కడప జిల్లా అధ్యక్షులు పల్లినేని నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. కడప కమ్మ సంఘం కార్యాలయంలో కమ్మ సంక్షేమ సంఘం కడప జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. గౌరవ అధ్యక్షులు దొడ్డపనేని చంద్ర శేఖర్ నాయుడు, జిల్లా అధ్యక్షులు పల్లినేని నాగేశ్వర రావు, జనరల్ సెక్రటరీ వేలూరి రవి చంద్ర, ట్రెజరర్ ఇప్పర్ల పూర్ణ చంద్ర రావు, కమిటీ సభ్యులు ఇప్పర్ల శివశంకర్, దామనచర్ల పవన్ కుమార్, గుత్తా ప్రసాద్ నాయుడు, ఇప్పర్ల నాగేంద్ర, వి. సుబ్బరాయుడు, బి. శివశంకర్, ఎం.సుధాకర్ నాయుడు, కలవకూరి చిన్న వెంకటసుబ్బయ్య, వైకుంఠం మదన్మోహన్ నాయుడు, భవాని శంకర్, కొమ్మ హనుమంత నాయుడు, కామినేని ప్రవీణ్, కొల్లి రామ సుకుమార్, దానంచర్ల శ్రావణ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్మ సామాజిక వర్గం వారు రాజకీయంగా బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.



# చంద్రబాబు పాలనలో రాయలసీమకు ప్రతిసారీ అన్యాయం

**రాయచోటి జనవరి 2 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలనలో ప్రతిసారీ రాయలసీమకు అన్యాయమే జరుగుతోందని వైయస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. రాయచోటి వైయస్ఆర్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర నాథ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషలతో కలసి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్ట్ ల నుంచి విద్యాసంస్థల ఏర్పాటు వరకు చంద్రబాబు ఏనాడు ఈ ప్రాంత అభివృద్ధిపైన చిత్తశుద్ధితో వ్యవహరించలేదని ధ్వజమెత్తారు. తాజాగా రాయచోటి నియోజక వర్గంలోని సంబేపల్లె పర్యటన సందర్భంగా సీఎం హోదాలో కొత్త విద్యాసంస్థలు, రాయచోటి నీటికష్టాలకు పరిష్కారంను ప్రకటిస్తారని ఆశించిన ప్రజలకు చంద్రబాబు తీవ్ర నిరాశను మిగిల్చారని అన్నారు.

చంద్రబాబు అంటేనే చేయాల్సింది చేయడు.. ఇతరులు చేసిందంతా తానే చేసినట్లు ప్రచారం చేసుకోవడం అని అందరికీ తెలుసు. ఈ దేశంలో ఐటీకి తానే మూలపురుషుడుగా, హైదరాబాద్కు ఐటీని పరిచయం చేసిన విజనరీగా తనను తాను సిగ్గు లేకుండా పరిచయం చేసుకోవడం ఒక్క చంద్రబాబుకే చెల్లుతుందని,అదే సమయంలో బెంగుళూరు ఎందుకు ముందుకు పోయిందన్నారు. వాస్తవానికి వైయస్ రాజశేఖరరెడ్డి సీఎం అయిన తరువాత హైదరాబాద్లో ఐటీ రంగం బెంగుళూరుకు సమాంతరంగా గణనీయమైన ఆదాయాన్ని సాధించిందన్నారు. చంద్రబాబు హయాంలో కన్నా వైఎస్ఆర్ హయాంలో మూడింతలు ఐటి రంగం అభివృద్ధి చెందిందన్నారు.కానీ చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టేలా తానే ఐటీని కనిపెట్టినట్లు చెప్పుకుంటున్నాడు. చివరికి హైదరాబాద్ ను సైతం తానే అభివృద్ధి చేసినట్లు చెప్పాడు.

శనివారం ఐటీ ఉద్యోగులను పక్కన పెట్టుకుని సంబేపల్లెలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు స్ఫూర్తిదాయకంగా మాట్లాడతారని అందరూ ఆశించారు. కానీ చంద్రబాబు చెంత ఉన్న ఐటీ ఉద్యోగులు మేం తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడ్డాం, మేం సంపాధించినది పార్టీ కోసం ఖర్చు చేశాం, ఎన్నికల్లో పార్టీ ఏజెంట్లుగా కూర్చున్నాం, గ్రామాల్లో మేమే పార్టీ బాధ్యత తీసుకున్నాం, చెప్పడం ఆశ్చర్యం కలిగించింది.

రాయచోటి ప్రాంతానికి వచ్చిన సందర్భంగా ఒక్క విద్యాసంస్థను కూడా ప్రకటించలేదు. మదనపల్లెలో మెడికల్ కళాశాలను ప్రైవేటీకరించవద్దని, యూనివర్సిటీకి నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు ప్రశ్నిస్తే వారిని అరెస్టు చేసారన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడను ఆనాడు వైయస్ఆర్, ఆ తరువాత వైయస్ జగన్ ప్రత్యేక సెజ్గా అభివద్ధి చేశారు. దీనిని మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు చంద్రబాబు చొరవ చూపాలి. చేసింది చెప్పాలే కానీ జరిగిందంతా తానే చేసినట్లు చెప్పుకోవడం సరికాదు.

ఇచ్చిన హామీలను అమలుచేయక పోవడం ప్రజలను మోసగించినట్లే కదా సంపద సృష్టించడం గురించి ప్రజలకు చెప్పడం కాదు, వారు సంపద సృష్టించుకునేలా ప్రభుత్వం పని చేయాలి. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం ఆదుకోవాలి. 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఈ ఎనిమిది నెలల్లో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రాష్ట్ర ప్రజలకు కీలకమైన పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు కుదిస్తున్నా చంద్ర



బాబు మాట్లడటం లేదు. పోలవరం నుంచి కష్ణా బ్యారేజీకి, అక్కడి నుంచి ప్రకాశం జిల్లాకు, అక్కడి నుంచి వెలుగొండ ద్వారా బనకచర్ల క్రాస్ కు నీటిని తరలిస్తారో సరైన ప్రణాళిక ఉందా? అని శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. వైఎస్ఆర్ పెట్టిన ఫీజు రీయంబర్స్ మెంట్ తోనే పేదలు ఇంజనీరింగ్,ఎం బిఎ,ఎం సి ఏ లు చదవగలిగారన్నారు.జగన్ హయాంలో 17 మెడికల్ కళాశాలలు కడితే ప్రయివేట్ పరం చేయాలన్న ఉద్దేశ్యంతో ఎం సి ఐ ఇచ్చిన మెడికల్ సీట్లను మీరు వద్దన్నారన్నారు. కేంద్ర బడ్జెట్ లో ప్రతి సంవత్సరం 75 వేల మెడికల్ సీట్లు ఇస్తామని ప్రకటించారని, మీరు అప్పుడు మెడికల్ కాలేజీలను టెక్ అప్ చేసి ఉండి ఉంటే ఇప్పుడు మెడికల్ కళాశాలలకు మంచి జరిగివుండేది కదా అని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

## జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

**లక్కిరెడ్డిపల్లి; ఫిబ్రవరి 03, ప్రభాతవార్త**



జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలం దప్పేపల్లి గ్రామంలోని మేడిమాయ గుంతకు చెందిన కొర్లకుంట నాగరాజు 74 కిలోల కేటగిరిలో 450 కిలోల బరువునెత్తి ప్రధమ స్థానంలో నిలిచి బంగారు పథకాన్ని సాదించడం రాష్ట్రానికే గర్వకారణమని విఆర్డియెస్ సురేంద్రారెడ్డి అన్నారు. సంయుక్త భారతీయ కేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జైపూర్లో జనవరి 30 31తేదీలలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుండి ప్రధమ స్థానంలో నిలబడి బంగారు పథకాన్ని సాధించడంతో ఫౌండేషన్ ప్రెసిడెంట్ పంకజ్ గౌడ, జనరల్ సెక్రటరీ శివ తివారి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం అభినందదగ్గవిషియమని తెలిపారు. ఈ సందర్భంగా విఆర్డియెస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతు కొర్లకుంట నాగరాజు ప్రతిభకు పేదరికం అడ్డుకాదని గోల్డ్ మెడల్ సాధించి నిరూపించాడని తెలిపారు.బంగారు పథకం సాధించడంతో నాగరాజు తల్లిదండ్రులు కొర్లకుంట రమణయ్య, రత్నమ్మ,స్నేహితులు అభినందనలు తెలిపి గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు.

## గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**పీలేరు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:**

క్రీడా పోటీల్లో పేలేరు అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ఓవరాల్ ఛాంపియన్ సాధించారని ప్రిన్సిపల్ బేబీ కరుణ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా బాకరాపేటలో సాయిరాం. పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 10 జట్లు పాల్గొనగా తమ పాఠశాల జట్లు అండర్14, అండం 17 జట్లు ప్రథమ, ద్వితీయ స్థానం. సాధించాయని ఆమె తెలిపారు. అండం 14, అండం 17 విభాగాల్లో వ్యక్తిగత ఛాంపియన్ చాధించి వోవరాల్ ఛాంపియన్షను సొంతం చేసుకోవడం గర్వకారణమని ఆమె అన్నారు. ఖిపీఈటీ పుష్పలత, విద్యార్థులను ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినంధించారు.

# పండ్ల మార్కెట్లో వ్యాపారుల చేతివాటం

**మదనపల్లె, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**

మదనపల్లె ఫ్రూట్స్ మార్కెట్లు బెంగుళూరు బస్టాండు, చిత్తూరు బస్టాండు, ఆర్టీసి బస్టాండుల్లో తోపుడు బండ్లపై కనిపిస్తాయి. ప్రత్యేకంగా మార్కెట్ అంటూ లేకపోయినా ఇక్కడ జరిగే మోసాలు అన్ని ఇన్ని కావనే చెప్పాలి. ఫ్రూట్ మార్కెట్లో మీరు పండ్లు కొనుగోలు చేస్తున్నా...తూకం సరిపోతుందని భావిస్తున్నారా..చెల్లించే డబ్బులకు సరిపడా వచ్చాయని అనుకొంటున్నారా..అయితే మీరు పప్పులో కాలేసినట్లే..ఎందుకైనా మంచిది మీరు కొన్న పండ్లను వేరే కాటాల్లో వేసి తూక ం సరిపోయిందా లేదా చూసుకోండి నగరంలో ఉన్న పండ్ల మార్కెట్లో చాలా చోట్ల తూకాల్లో వ్యత్యాసం వస్తోంది. పండ్ల మార్కెట్, మాంసం దుకాణాల్లో ఇలా ప్రతిచోట కల్తీనే..మోసమే..దీంతో డబ్బులకు తగ్గట్టు సరుకులు వినియోగదారుడికి అందక నిలువునా మోసానికి గురవుతున్నారు. అధికారులు తూతూ మంత్రంగానే తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. పట్టనంలో చాలా ప్రాంతంలో పండ్ల దుకాణాలు, తోపుడు బండ్లు ఉన్నాయి. బెంగుళూరు బస్టాండు, చిత్తూరు బస్టాండు ఫ్రూట్స్ దుకాణాల్లో, ఆర్టీసి బస్టాండు దుకాణాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం ఆయా వ్యాపారులు ప్రతి ఏడాది తూనిక యంత్రాలకు బాట్లకు ముద్ర వేయించాలి. అయితే అత్యధికంగా పండ్ల దుకాణాల్లో రెండేసి తూనిక యంత్రాలను వాడుతూ పరిస్థితులను బట్టి వినియోగదారులను మోసం చేస్తున్నట్లు సమాచారం. మార్కెట్లో వ్యాపారుల వద్ద కనిపించే త్రాసులు, పండ్లు వేసిన వైపు ఏదో పేరుతో కనీసం 200గ్రాముల అదనపు బరువు, ఈమేరకు వినియోగదారునికి బరువు ఎక్కడా నిజమైన కాటాలు ఉండవు. తూకం సరిగ్గా ఉండదు. దాదాపు అందరూ కాటాను పట్టుకునే తూకం వేస్తారు. అక్కడ చేతివాట చూపుతూ ప్రతి ఫలం పొందుతారు. ఎవరైనా ఇదేమని ప్రశ్నించబోతే కాకమ్మ కథలు చెబుతారు. మతిమీరితే మూకుమ్మడిగా దాడికి దిగుతారు. ఆ



తిట్ల పురాణం వినలేక కొనుగోలుదారులు నోరుమూసికొని వెలుతున్నారు. ఇది పట్టణంలో పండ్ల వ్యాపారుల దోపిడి స్థితి, తోపుడబండ్లపై పండ్ల వ్యాపారులు చేసేవారు మరీ దారుణంగా తయారైంది. పండ్లను సర్దుతున్నట్లుగానే ఉంటారు కనురెప్పమూసిలోపు చూపించిన పండ్లను కాకుండా వేరేపండ్లను కట్టివేస్తారు. వ్యాపారులు కంప్యూటర్ తూనిక యంత్రాలతో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారు. యంత్రాలు డిస్ప్లేలో ఆర్పులు చేసి కిలోకి 100నుంచి 200గ్రాములు తగ్గట్టుగా చేస్తున్నారు. అయితే ఇలాంటి వాటిని అధికారులు గుర్తించి సీజ్ చేస్తున్నారు. ఫ్రూట్స్ కాకుండా ప్రధానంగా చేపలు, చికెన్, మటన్ల ఇలానే మోసాలకు పాల్పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే నిబంధనలకు విరుద్ధంగా పండ్లను విక్రయిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రతిభ టాలెంట్లో విద్యార్థులకు బహుమతులు




**మైదుకూరు, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త:**

నియోజకవర్గస్థాయిలో పదో తరగతి విద్యార్థులకు మేధా విద్యా సంస్థల యాజమాన్యం నిర్వహించిన ప్రతిభా పరీక్షలో శాంతినికేతన్ విద్యార్థిని పి.వి జోషిత ప్రథమ బహుమతి మరియు ఎం. శివరాఘవ తృతీయ బహుమతిని సాధించారు. వారి ప్రతిభను పాఠశాల కరస్పాండెంట్ మదన్ మోహన్ రెడ్డి మరియు ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు విద్యార్థులను అభినందిచారు.

## రథసప్తమి వేడుకలను జయప్రదం చేయండి

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 2 ,ప్రభాత వార్త**



పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నందు ఈనెల 4వ తేదీన రథసప్తమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 4వ తేదీ ఏడు వాహనమలలో గుడి ప్రదక్షణ నిర్వహించబడునున్నారు. ఇందులో భాగంగా ఉదయం 6:30 గంటల నుంచి 7.30 గంటల వరకు సూర్యప్రభ వాహనము, 7:45 నుండి 8:30 గంటల వరకు శేష వాహనము, 9:30 గంటల నుండి 10.30 గంటల వరకు హనుమంత వాహనము, 11 గంటల నుండి 12 గంటల వరకు గరుడ వాహనము, అలాగే సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు అశ్వ వాహనము, 6.30 గంటల నుండి 7.30 గంటల వరకు గజవాహనము, 8 గంటల నుండి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనము కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రాత్రి 8 గంటల నుంచి 8:30 సమయంలో అల్పాహార విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణతో పాటు రాత్రి 9 గంటలకు కోలాటం కార్యక్రమం ఉంటుందని పై కార్యక్రమాలలో భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

## జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

### విద్యార్థులకు మెమొంటోలు, మెరిట్ సర్టిఫికెట్స్ ప్రధానం

### ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి వెల్లడి



**సంబేపల్లి ఫిబ్రవరి 2 ప్రభాత వార్త..**

ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో ప్రథమ స్థానం పొందిన సంబేపల్లి హైస్కూల్ విద్యార్థులకు మెమొంటోలు, మెరిట్ సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం కడపలో నాగార్జున డిగ్రీ కళాశాల నందు నిర్వహించిన ఏకలవ్య ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఈ బహుమతులను ప్రధానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ బహుమతులు పొందిన వారిలో పదవ తరగతి విద్యార్థిని రుక్సానా, 9వ తరగతి విద్యార్థులు మోనిక, తరుణ్ కుమార్ గౌడ్ లు ఉన్నారన్నారు. బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో కడప ఎంఈఓ గంగిరెడ్డి, నాగార్జున డిగ్రీ కళాశాల డైరెక్టర్ శివ విష్ణు మోహన్ రెడ్డి, డీఈఓ కార్యాలయం ఏడి మునీర్ ఖాన్, పాఠశాల ఏకలవ్య కోఆర్డినేటర్ రెడ్డి శేఖర్, ఏకలవ్య ఫౌండేషన్ సలహాదారులు గునిపాటి శ్రీనివాసులు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**దువ్వూరు, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఇరువురు వైకాపా నాయకులు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకొని ఇళ్లకు రాగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి వారిని పరామర్శించి వారి ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. గుడిపాడు మాజీ సర్పంచ్ తుమ్మల వెంకట కొండారెడ్డి ఇటీవల గుండెకు సంబంధించి స్టంట్ వేయించుకోగా అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని జాగ్రత్తగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలాగే పుల్లారెడ్డిపేటకు చెందిన ఇరగంరెడ్డి నాగేష్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతను హైదరాబాద్లోని కిమ్స్ హాస్పిటల్లో చికిత్స చేయించుకొని ఇంటికి రాగా అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ శంకర్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ మహబూబ్ బాషా, హరినాధ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయంలో సీసీ కెమెరాలు

**సిద్ధవటం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:**

శ్రీశైల దక్షిణ ప్రముఖ ద్వారం పెన్నానది ఒడ్డున వెలసిన మట్లి రాజుల కాలంలో నిర్మించిన అతి పురాతనమైన శ్రీబాల బ్రహ్మేశ్వర ఆలయంలో నేరాలను నివారించడంలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన 5 సీసీ కెమెరాలను ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు ప్రారంభించారు. ఆయనకు ఆలయ అర్చకులు సంప్రదాయాలతో ఘనంగా స్వాగతం పలికి శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు మాట్లాడుతూ అన్ని దేవాలయాల్లో నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పురాతనమైన బాల బ్రహ్మేశ్వర ఆలయంలో కెమెరాలు ఏర్పాటు చేయడం నేరాలు నివారించుటకు తోడ్పడుతాయన్నారు. సిద్ధవటం ఎంతో ప్రసిద్ధిగాంచిన గ్రామమని ఆలయ అభివృద్ధికి గ్రామ ప్రజలు నాయకులు తోడ్పడాలన్నారు. కడప నగరానికి చెందిన గిరిధర్, ఆలయ అభివృద్ధి కార్యకర్త అతికారి సుబ్బరాయుడు సహకారంతో రూ.40వేలు కెమెరాలు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి మండల ఎస్సై శివప్రసాద్, ఏఎస్సై సుబ్బరామచంద్ర, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## అలరించిన శాస్త్రీయ నృత్యాలు




**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:**

ఆటవిడుపు భాగంలో ఆదివారం కడప శిల్పారామంలో సాంస్కృతి కళావేదిక మీద మిస్వా మూవీ వారి సహకారంతో కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ వారిచే శాస్త్రీయ నృత్యాలు నగర వాసులను అలరించాయి. సినీ, నృత్యాలు, పల్లె, జానపద నృత్యాలుతో అదరహో అనిపించారు. వారు గోదారి గట్టు మీద రామచిలకవే, మందుల్లోడా మందుల్లోడా, గంధసిరి వనమాలి గ్రంధాలు వీక్షకులను అలరించారు. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలన అధికారి పి.శివ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

## రేపు సుబ్రహ్మణ్యం స్వామి షష్టి

**మదనపల్లె, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**



పట్టణంలోని యోగభోగేశ్వర స్వామి ఆలయంలో రేపు సుబ్రహ్మణ్యం స్వామి షష్టి మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మురళిస్వామి తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ భక్తులు ఈ మహోత్సవంలో పాల్గొనడం వల్ల కుజ, సర్పదోషాలు తొలుగుతాయన్నారు. విద్య, ఉద్యోగ, వివాహ, సంతాన, వ్యాపారం వారికి విశేష ఫలితలు కలుగుతాయన్నారు. భక్తాదులు, ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## కేసీ కాలువలో పెరుగుతున్న నీటి మట్టం



**దువ్వూరు, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త:**

మైదుకూరు నియోజకవర్గానికి ప్రధాన నీటి వనరు అయిన కేసీ కాలువకు రెండు రోజులుగా నీటి మట్టం పెరుగుతోంది. రాజోలి వద్ద కేసీ కాలువకు ప్రస్తుతం 400క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఏఈ జమాల్ వల్లి తెలిపారు. కేసీ కాలువ ఆయకట్టు రైతులు కింది భాగాన ఉన్న వారు నీరు కావాలని కోరగా, రైతుల కోరిక మేరకు నీటి మట్టాన్ని పెంచినట్లు తెలిపారు. ప్రస్తుతం కేసీ కాలువకు 400 క్యూసెక్కులు, చాపాడుకు 70క్యూసెక్కులు నీటిని వదులుతున్నామని రాజోలి వద్ద నుండి కుందూ నదిలోకి 1200క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందన్నారు. కుందూ నదిలోకి నీరు వచ్చేవరకు కేసీ కాలువకు నీరు వస్తుందని అన్నారు. ఎంతవరకు వస్తుందో తెలియడం లేదని కుందూ నదిలో నీరు ఉన్నంత వరకు వచ్చే అవకాశం ఉందన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం




**మదనపల్లె, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దామంటూ ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు. చట్టాల పరిరక్షణ, కార్పోరేట్ల ప్రయోజనాల కోసం దేశంలో కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చారని ఆయన తెలిపారు. ఆదివారం నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ పాలనలో కార్మిక హక్కులు, చట్టాలు, వారిపరిరక్షణ కోసం బలమైన కార్మికోద్యమాలు నిర్వహించాలని తెలిపారు.భవన నిర్మాణ కార్మికులకు రద్దు చేసిన సంక్షేమ బోర్డు పునరుద్దరించాలని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ కూటమి ప్రభుత్వం ఇంతవరకు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సివిల్ సప్లై కార్పోరేషన్ హామాలీ కార్మికులకు పెంచిన కూలీరేట్లు జీఓ అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, నాగరాజు, బత్తల రమణ,హుస్సేన్, కేశవరావు, ఫరీద్ పాల్గొన్నారు.

# సముద్రాల వారి వివాహ వేడుకలలో నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి2 (ప్రభాతావార్త):**

సత్యా హైవే టౌన్షిప్ అధినేత సముద్రాల వెంకటసుబ్బారావు (గురు) సతీమణి పద్మావతి కుమార్తె గైనకాలజిస్ట్ డాక్టర్ పవిత్ర, డాక్టర్ ఏవీఆర్ సాయి దినేష్ నూతన వదూవరుల వివాహ వేడుకలు ఆర్ ఆర్ కన్వెన్షన్ హాలునందు నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సముద్రాల వారి వివాహ వేడుకలు కొత్త తరహాలో జబర్దస్త్ ఆర్టిస్ట్ మరియు ప్రత్యేక ఈవెంట్ల మధ్య నిర్వహించిన వివాహ్ వేడుకలను ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఫుడ్ కమిషనర్ చిత్తా విజయప్రతాప్రెడ్డి బ్రదర్ స్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్రెడ్డి, వైస్చైర్మన్ సాయిక్రిష్ణ, అదనపు సమ న్వయకర్త విశ్వనాథరెడ్డి , మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరి వెంకటరమణారెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురు మోహన్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు గానుగంపెంట రమేష్బాబు, జడ్పీటీసీ వంకె పోలిరెడ్డి, పెద్ద పోలిరెడ్డి, బీజేపీ పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, స్టేట్ ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య,మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, ఆర్యవైశ్య ప్రముఖులు కనమర్ల పూటి ప్రసాద్, సీనియర్ న్యాయవాది పీవీఎన్.ప్రసాద్, దర్శి సుబ్రమణ్యం, కేవి.సుబ్బారావు, బచ్చు సుబ్రమణ్యం, కొలిశెట్టి నాగరాజతో పాటు క్లాస్1 కాంట్రాక్టర్ తమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య, బంగారుశీనయ్య, ప్రభాకర్రెడ్డి, పుత్తా శ్రీరాములు , యద్దారెడ్డి, పంగా చెన్న క్రిష్ణారెడ్డి, బిజ్జం రమణ, పాపిశెట్టి వీరాంజనేయులు, ఏపీయూజేడబ్ల్యు అధ్యక్షులు బి.వెంకటేష్, మాజీ స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ కేశవరెడ్డి, శేఖర్రాయల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్తో పాటు తుమ్మలపెంట సురేష్బాబు, అడ్వకేట్ పత్తి నాగేంద్ర ప్రసాద్, తులసి వెంకటశివ నారాయణ, పత్తి వెంకట నరసింహా,పబ్బతి చక్రపాణి, మెంటా నాగేంద్ర, జొన్నలగడ్డ సుధాకర్, వి.రమణతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు నూతన వదూవరులను ఆశీర్వదించి ప్రత్యేక విందులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు మాట్లాడుతూ ఆర్యవైశ్యులలో గుర్తింపు పొందిన సముద్రాల వెంకటసుబ్బారావు కుమార్తె గైనకాలజిస్టుగా సేవలందించి ఈ ప్రాంత ప్రజల ఆధరాభిమానాలు పొందిన సముద్రాల సుబ్బారావు కుమార్తె పవిత్ర, సాయిదినేష్లు భగవంతుని ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆశీర్వదించారు.





